# ఓర్వలేకే కాంగ్రెస్ చిచ్చు

- బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేకపోతున్నది
- పచ్చటి తెలంగాణపై కుట్రలు చేస్తున్నది
- ప్రతిపక్షాలు సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయి
- ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి అమానుషం
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, అక్టోబర్ 31: తెలంగాణలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, పచ్చటి తెలంగాణలో కాంగ్రెస్ చిచ్చు పెట్టాలని చూస్తున్నదని బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ మండిపడ్డారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి అమానుషమని ఖండించారు. చొప్పదండి పట్టణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ నేతలు బండి సంజయ్, అర్వింద్, ఈటల రాజేందర్ మాటలు, చేతలు ఏ మాత్రం బాగా లేవని విమర్శించారు. ఈ విద్వేష ధోరణి సమాజాన్ని విషపూరితం చేస్తున్నదని, ప్రజల మనసులు కలుషితం అవుతున్నాయని వాపోయారు. ఇది తెలంగాణకు మంచిది కాదని కేసీఆర్ ఎప్పటి నుంచో చెబుతున్నారని తెలిపారు. పచ్చటి తెలంగాణలో నెత్తుటి రాజకీయం మొదలైందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. తూటా పేల కుండా, కర్ఫ్యూ రాకుండా, రక్తపు చుక్క చిందకుండా తెలంగాణను సీఎం కేసీఆర్ కాపాడుతున్నారన్నారు. తెలంగాణ శాంతికి చిరునామాగా మారిందని చెప్పారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ అధికారం కోసం చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడం బహుశా ఇదే మొదటి సారి అన్నారు. నాలుగు ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతలు విచ్చలవిడిగా, అడ్డూ అదుపూ లేకుండా వాడుతున్న భాష తెలంగాణ భవిష్యత్‌కు మంచిది కాదని హితవు పలికారు. టికెట్ల అమ్మకాలతో పార్టీలో రచ్చ జరుగుతుండడం, నాయకులంతా పార్టీ నుంచి వెళ్లి పోతుండడంతో రేవంత్ రెడ్డి బ్యాచ్‌కు ఓటమి తప్పదని అర్థమైందన్నారు. నిస్పృహలో కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని, అవి మానుకోవాలని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ దూసుకు పోతుండడంతో కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమని సర్వేలు ముక్తకంఠంతో చెబుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం నీరజ, సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మాజీ ఎంపీపీలు గుర్రం భూమారెడ్డి, వొల్లాల కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిలర్లు వడ్లూరి గంగరాజు, మాదూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, కొత్తూరి నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ హింసను ప్రేరేపిస్తున్నయ్

- ప్రజల చేతుల్లో వారికి పరాభవం తప్పదు
- శాంతియుత పాలనలో తెలంగాణ నంబర్‌వన్
- తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య




తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, పక్కన టీపీటీడీసీ చైర్మన్ గూడూరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర నేత నర్సింగరావు, సెస్ చైర్మన్ చిక్కాల

సిరిసిల్ల టౌన్, అక్టోబర్31: సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు హింసను ప్రేరేపిస్తున్నాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి విచారకరమన్నారు. హింసకు చోటులేని రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరుగడం దురదృష్టకరమన్నారు. సంక్షేమాన్ని జీర్ణించుకోలేకే ప్రసంగాల ద్వారా కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేస్తున్న వ్యాఖ్యలతో దాడులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ మాటలను వారి క్యాడర్ అనుసరిస్తున్నారని విమర్శించారు. దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మోసం చేయలేరన్నారు. అధికారంలోకి రావాలన్న కాంక్షతో చేస్తున్న చిల్లర, మల్లర వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ, నిత్యం ప్రజల్లో ఉండే బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రక్తపాతం, హింసకు చోటులేకుండానే ఉద్యమం చేసి, రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కేసీఆర్ పాలనలో హింసాయుత ఘటనలకు చోటులేదన్నారు. ప్రజాతీర్పును శిరసావహించడమే రాజకీయ పార్టీల లక్షణంగా ఉండాలన్నారు. అధికారంలో ఉండి ప్రజల మనసులు గెలుచుకున్న బీఆర్ఎస్‌ను ఇబ్బందులు పెట్టాలనుకున్న కాంగ్రెస్, బీజేపీలకు పరాభవం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, బీఆర్ఎస్‌వై నాయకుడు మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

## జూడో పోటీలకు ఎంపిక

చొప్పదండి (రామడుగు), అక్టోబర్ 31: కరీంనగర్‌లోని మానేర్ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో రామడుగు మండలం దేశరాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మ, పీఈటీ వెంకటరమణ తెలిపారు. 23 కేజీల విభాగంలో ఆకుల సాత్విక, 27 కేజీల విభాగంలో అమరగొండ స్వాతి, 36 కేజీల విభాగంలో కాస శివాని, 40 కేజీల విభాగంలో కావ్య, 44 కేజీల విభాగంలో కట్ట సంధ్య, 30 కేజీల విభాగంలో వేణుకుమార్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను సర్పంచ్ కోల రమేశ్, ఎంపీటీసీ వంచ మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రత్నాకర్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## వందశాతం పన్నులు వసూలు చేయాలి

కార్పొరేషన్, అక్టోబర్ 31: నగరపాలక సంస్థ పరిధిలో రెవెన్యూ ప్రకటనల పన్నులను వందశాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. నగరంలోని బల్దియా సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను విషయంలో ప్రత్యేకంగా దృష్టిసారించి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సూచించారు. మార్చిలోగా వందశాతం పన్నులు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తి చేసేందుకు తగి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

## నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

గంగాధర, అక్టోబర్ 31: మండలంలో బుధవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు తాడిజెర్రి, 9 గంటలకు రంగరావుపల్లి, 10 గంటలకు గోపాల్‌రావుపల్లి, 11 గంటలకు మల్లాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## విద్యార్థికి అభినందన



వివేక్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి

చొప్పదండి(రామడుగు), అక్టోబర్ 31: మండలంలోని గోపాలరావుపేట ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థి వేముల వివేక్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. కాగా, వివేక్‌ను మంగళవారం కళాశాల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



శ్రీనివాస్‌ను ఓదార్చుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 31 : గంగాధర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సామంతుల శ్రీనివాస్ మాతృమూర్తి సత్తవ్వ మంగళవారం మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్ తదితరులున్నారు.

## జయపాల్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



జయపాల్ రెడ్డితో గంగాధర మండల నాయకులు

గంగాధర, అక్టోబర్ 31: మైత్రీ గ్రూప్స్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి మంగళవారం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, మండల బీఆర్ఎస్ నాయకులు జయపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా జయపాల్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, దోర్నాల హన్మంతరెడ్డి, వీడీసీ చైర్మన్లు రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, అలువాల తిరుపతి, నాయకులు దాసె ఓదెలు, బొజ్జ మహిపాల్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

సైదాపూర్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతున్నదని ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు పోలు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరికీ న్యాయం చేసిందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాంనగర్, అక్టోబర్ 31: కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మహంకాళి లింగయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పులు కావడంతో సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. పక్కనే ఉన్న బంధువులు గమనించి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లింగయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.